చిట్టడవిని తలపిస్తున్న కాటన్ పార్కు



పచ్చిక బైళ్లను తలపిస్తోన్న, స్థానిక ఉప్పుటేరు వంతెన వద్ద ఉన్న కాటన్ పార్కు



తుప్పుపట్టి, పిచ్చిపాదులు పెరిగిన కాటన్ పార్కులోని చిన్నారులు ఆడుకునే ఆట వస్తువులు



కాటన్ పార్కు పశ్చిమ జిల్లా పర్యాటక శాఖకు చెందినదని బోర్డు పెట్టి, వదిలివేసిన దృశ్యం

ఆహ్లాదానికి వెళితే ప్రాణాపాయమేనంటున్న జనం

ఆకివీడు: ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన కాటన్ పార్కు నిర్లక్ష్యంతో చిట్టడవిని తలపిస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లా డ్రెయినేజీ శాఖకు సంబంధించిన ఈ ప్రాంతంలో పార్కు ఏర్పాటుకు 40 ఏళ్ల క్రితమే స్థలం కేటాయించి, కాటన్ స్తూపాన్ని నిర్మించారు. కొన్నాళ్లుగా ఆ ప్రాంతం అడవిని తలపించగా, గత కొన్నేళ్లుగా దాని అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్.నర్సింహరాజు ఆధ్వర్యంలో పార్కు సుందరీకరణకు చర్యలు తీసుకున్నారు. గత రెండేళ్లుగా పార్కును పట్టించుకునేవారు లేరు. దీని అభివృద్ధికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో తాళం వేశారు. ఇటీవల తాళం తెరిచినప్పటికీ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోలేదు.

అన్ని వసతులున్నాయి

కాటన్ పార్కులో అన్ని వసతులూ ఏర్పాటు చేశారు. ప్రత్యేక భవనం నిర్మించారు. ఆంధ్ర వంటల పేరుతో స్టాల్ కూడా ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, జారుడుబల్ల, ఉయ్యాల, తదితర వాటిని ఏర్పాటు చేశారు. విశాలమైన ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. పార్కులో ఎన్టీఆర్, అల్లూరి, వివేకానంద వంటి ప్రముఖుల విగ్రహాలతో పాటు, కాటన్ స్తూపం చూపరుల్ని ఆకట్టుకుంటుంది.

నిర్లక్ష్యానికి తుప్పుపట్టింది

ప్రస్తుతం పర్యాటక శాఖ ఆధీనంలో ఉన్న పార్కు చిట్టడవిని తలపిస్తుంది. లోపలకు వెళ్లాలంటే పాములు, క్రిముల భయం వేస్తుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ఆడుకునే ఆట వస్తువులన్నీ తుప్పుపట్టాయి. దట్టమైన గడ్డితో ఆ ప్రాంగణం నిండిపోయింది. పాదులు, పొదలతో నిండిపోయింది. ఆదర్శమూర్తుల విగ్రహాలు కూడా కన్పించనంతగా చెట్లు పెరిగిపోయాయి. భవనంలోని గుమ్మాలు, కిటికీలు పాడైపోతున్నాయి.

పార్కును పట్టించుకోడి మహాప్రభో

ఉప్పుటేరు వద్ద ఉన్న కాటన్ పార్కును పర్యాటక శాఖ పట్టించుకుని అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. పార్కులో పుట్టినరోజులు, పెళ్లి రోజులు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు, విద్యార్థులు పర్యటక వీక్షణకు, అనుకూలంగా ఏర్పాట్లు చేయాలి. ఉప్పుటేరుకు చేర్చి పార్కు ఉండటంతో గతంలో పెడస్టల్ బోటు సౌకర్యం కల్పించారు. బోటు క్లబ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. పర్యాటకులు విహరించే విధంగా బోటు సౌకర్యం ఉంటే ఈ ప్రాంతం మరింత పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందంటున్నారు.

కాటన్ స్ఫూర్తికి చిహ్నం



కాటన్ మహాశయుని ఆశయాలకు అనుకూలంగా, ఆయన స్ఫూర్తికి చిహ్నంగా ఏర్పాటు చేసిన పార్కు పట్ల నిర్లక్ష్యం తగదు. పర్యాటక శాఖ నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలి. గతంలో విద్యార్థులు, పర్యటక ప్రియులు దీనిని వినియోగించుకునేవారు. మళ్లీ ఆ వైభవం తీసుకురావాలి. విద్యార్థులు ఆరోగ్యం, ఆహ్లాదం పొందేవిధంగా పార్కును అభివృద్ధి చేయాలి.

–టీ. వెంకటేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయుడు, ఆకివీడు.

‘భవ్య భీమవరం’ పనులు వేగిరపర్చాలి

భీమవరం (ప్రకాశంచౌక్): భవ్య భీమవరం అభివృద్ధి పనులు పురోగతిని వేగవంతం చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి భవ్య భీమవరం అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. వివిధ ప్రదేశాలలో చేపట్టిన పనులు పురోగతి, పింక్ టాయిలెట్స్ నిర్మాణాలకు తీసుకున్న చర్యలపై రెవెన్యూ, మున్సిపల్, సంబంధిత శాఖల అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవ్య భీమవరం పట్టణం సుందరీకరణ పనుల్లో భాగంగా జరుగుతున్న అభివద్ధి పనులు వేగవంతం చేయాలని అన్నారు. భీమవరం పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పార్కుల అభివృద్ధి పింక్ టాయిలెట్స్ ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలోకి వెళ్లి అవసరమైన స్థలాలను పరిశీలించాలని ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం శాఖ అధికారి వెంకట అప్పారావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఏ.రాంబాబు, మున్సిపల్ డిఇ టి.త్రినాథ్ రావు, ఆర్‌అండ్ బి ఎస్.సి ఎ.శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ డిఈ వెంకటేశ్వరరావు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



సంకల్పం ప్రత్యేక అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ వాణీ విజయరత్నం



సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ టి.భావన



సంకల్ప ప్రోగ్రాంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆకివీడు: లింగ నిర్ధారణ చేయడం చట్ట రీత్యా నేరమని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆకివీడు ప్రాజెక్టు అధికారిణి వాణీ విజయరత్నం హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మిషన్‌శక్తి సంకల్పంపై పది రోజుల అవగాహనా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ లింగవివక్షత తగదన్నారు. సృష్టికి ప్రతి సృష్టి కర్త మహిళేనన్నారు. మహిళలు ఆరోగ్యవంతమైన జీవనం గడిపేందుకు కృషి చేయాలన్నారు. క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. దంత, రొమ్ము క్యాన్సర్, గర్భకోశ క్యాన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించాలని విజయరత్నం పిలుపునిచ్చారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్క మహిళా రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్యురాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

కాళ్ల: గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని దానిని అతిక్రమిస్తే మొదటి తప్పుగా 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా, రెండవసారి చేస్తే 5 సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని కాళ్ళ పీహెచ్‌సీ వైద్యురాలు టి.భావన తెలిపారు. కాళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం క్యాన్సర్ వ్యాధి, గర్భస్థ లింగ నిర్ధారణ అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడపిల్లలు పుట్టాలి..ఎదగాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం 1994లో ప్రత్యేక కఠిన చట్టం అమలులోకి తెచ్చిందన్నారు. అదేవిధంగా క్యాన్సర్ వ్యాధి శరీరంలో ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉందన్నారు. సకాలంలో గుర్తిస్తే సరైన వైద్యం ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.తులసి, వి.కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సంకల్ప ప్రోగ్రాం పై అవగాహన

పాలకోడేరు: మండలంలో ఐసీడీఎస్, ఆకివీడు ప్రాజెక్టు పరిధిలో ×సంకల్ప స్పెషల్ అవగాహన కార్యక్రమంలో భాగంగా పాలకోడేరు మండలం ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, వైద్య సిబ్బందికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సత్యనారాయణ, న్యూట్రిషనిస్ట్ ఎం. బాలాజీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పార్వతి, సూర్యకుమారి, మండలం పరిధిలో ఉన్న కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల అవసరాలపై పర్యవేక్షణ చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): ఆదరణ, సంరక్షణ అవసరమైన పిల్లల కోసం స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహిస్తున్న సంస్థలపై, తరచూ పర్యవేక్షణ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాస్థాయి స్వచ్ఛంద సేవల సంరక్షణ కమిటీ సభ్యులుతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదరణ, సంరక్షణ అవసరమైన పిల్లల కోసం నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలపై కమిటీ సభ్యులు తరచూ తనిఖీలు చేయాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ లైసెన్సు కలిగియున్న 12 స్వచ్ఛంద సేవా సంస్థలును ప్రతి మూడు నెలలకు ఒకసారి పర్యవేక్షణ చేసి వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేవా తెలుసుకోవాలని సూచించారు. ఏమైనా లోటు పాట్లు ఉంటే వాటిని వెంటనే సరి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై ప్రత్యేక ప్రణాళికను నిర్వహించాలని, ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి రిపోర్టును అందజేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.లక్ష్మీ, డీసీపీఓఆర్ .రాజేష్, సిడబ్ల్యుసీ పి.వెంకటేశ్వరరావు, డా.బిందు, మెడికల్ ఆఫీసర్ డా.సతీష్, అడ్వకేట్ చిత్రబాను, తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడి నిమజ్జన ఊరేగింపు



గణేష్ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్లుతున్న దృశ్యం.



మహదేవపట్నంలో స్వామివారిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

ఆకివీడు: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు ప్రత్యేక పందిళ్లలో స్వామివారి నిమజ్జన కార్యక్రమం మంగళవారం వివిధ చోట్ల ప్రారంభించారు. ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విగ్రహాల వద్ద పూజలు చేసి ఏడవ రోజు స్వామివారిని గంగమ్మ ఒడికి తరలించేందుకు నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. స్థానిక పుర వీధుల గుండా ఊరేగింపు కొనసాగింది. స్థానిక లాంచీల రేవు వద్ద, శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసి ప్రత్యేక పందిళ్లలోని విగ్రహాల్ని నిమజ్జనం చేశారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు

ఉండి: మండలంలోని పలు గ్రామాల్లో చవితి పండుగ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకస్వామి విగ్రహాలను భక్తులు వైభవంగా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మహదేవపట్నం గ్రామంలో చేపట్టిన నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువత, భక్తులు, నిర్వాహకులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

క్యాన్సర్‌పై అపోహలు వద్దు



మాట్లాడుతున్న సీనియర్ హెమటాలజిస్ట్ డాక్టర్ గణేష్ జైశెత్వార్

భీమవరం(ప్రకాశం చౌక్): సకాలంలో రక్త క్యాన్సర్‌ను గుర్తించి చికిత్స అందజేస్తే వ్యాధి నుంచి పూర్తి కోలుకోవచ్చని హైదరాబాద్ యశోద ఆస్పత్రి సీనియర్ హెమటాలజిస్ట్ డాక్టర్ గణేష్ జైశెత్వార్ అన్నారు. ప్రపంచ రక్త క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా భీమవరంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 18 ఏళ్ల ఉమా గంగాధర్ ఐదు సంవత్సరాల క్రితం సగం జన్యువుతో సరిపోలిన (హాప్లోయిడెంటికల్) ఎముక మజ్జ మార్పిడితో ప్రాణాంతక రక్త క్యాన్సర్‌ను జయించాడు. ఇప్పుడు ఆరోగ్యంగా, బలంగా వ్యాధి లేకుండా ఉన్నాడని, సకాలంలో చికిత్స, అధునిక వైద్యంతో క్యాన్సర్ జయించవచ్చొన్నారు. క్యాన్సర్‌కు సకాలంలో చికిత్సతో మనం ఆరోగ్యాన్ని, కాకుండా రెండవ జీవితాన్ని బహుమతిగా పొందడం జరుగుతుందన్నారు.

కూటమి ప్రభుత్వాన్ని నిలదీయండి



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న చినమిల్లి వెంకట్‌రాయుడు

వీరవాసరం: గ్రామాల్లో కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేసేవరకు నిలదీయాలని భీమవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకట్‌రాయుడు తెలిపారు. వీరవాసరం మండలంలోని నందమూరి గరువు, పెరికిపాలెం, వీరవాసరం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో అబద్ధపు హామీలు, బూటకపు వాగ్దానాలతో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిందన్నారు. నాలుగైదు పార్టీల కూటమిగా జట్టు కట్టి అధికారం చేపట్టిన చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. నరసాపురం పార్లమెంట్ ఇంచార్జ్ గూడూరి ఉమాబాల మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు, బీసీలకు, ఎస్సీలకు పెద్దపీట వేశారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు బటన్ నొక్కి చేయూతనందించారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానుఫ్యాస్టోలో ఇచ్చిన హామీలను ప్రజలందరికీ అమలు జరిగేలా వైఎస్సార్ సీపీ నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. నందమూరి గరువు, పెరికిపాలెం, వీరవాసరం గ్రామాల్లో నూతనంగా నియమించిన కమిటీలను ప్రత్యేకంగా అభినందించారు. వైఎస్సార్ సీపీ పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చవాకుల సత్యనారాయణమూర్తి, గూడూరి ఓంకారం నేతల జ్ఞాన సుందరరాజు మానుకొండ ప్రదీప్ ,గాదిరాజు రామరాజు, మద్దాల అప్పారావు, చికెలే మంగతాయారు, వీరవల్లి కనక ఉషారాణి ,బోను జోష్ణ దేవి, గుబ్బల శ్రీనివాసరావు ,ముద్రగళ్ల యేసు రాజు ,కందుల సత్యనారాయణ , శ్రీనివాసరావు, కావలి దాము కోరసిక పెద్దిరాజు, అప్పారావు ,బొంతు రమేష్, పాలవెల్లి మంగ , పులగం గున్నయ్య ప్రవీణ్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను అలవర్చుకోవాలి



ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ నైపుణ్యాల కల్పన శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అధ్యాపకులు

భీమవరం: ఉద్యోగ అవకాశాలు విస్తృతమవుతున్న తరుణంలో విద్యార్థులు దానికి అనుగుణనంగా విభిన్నమైన సాంకేతిక నైపుణ్యాలను అలవర్చుకోవాలని సాగర్ జాన్ చెప్పారు. భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన ఉద్యోగ నైపుణ్యాల కల్పన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలంటే ముందుగా జీవన నైపుణ్యాలలో పరిణతి చెందాలని క్రమం తప్పకుండా మెరుగైన స్థితిని అందుకోవాలన్నారు. ఒక బిలియన్ కోసం ఒక మిలియన్ మంది నిష్ణాతులుగా తయారు కావాలని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ముందుగా భావ ప్రకటన సామర్థ్యాన్ని సాధిస్తే అన్నింటిలోనూ రాణించవచ్చునన్నారు. శిక్షణ తరగతులకు అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ పి అరవింద స్వామి మాట్లాడుతూ విద్యార్థులు సానుకూల వైఖరితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి ఎస్ లక్ష్మీకాంతం, అధ్యాపకులు కాకుమాని శ్రీనివాసరావు, జి ఉమామహేశ్వరి, ఎల్ నర్సింహారావు, డీవీసీహెచ్ సత్యనారాయణ, జి ప్రసాద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవి ట్రస్ట్ సేవలు అభినందనీయం



కాళ్ళకూరు వెంకటాపురం వద్ద పంటకాల్వలో రేవు ప్రారంభిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్ళకూరు గ్రామంలో శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు ద్వారా ప్రజలకు సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందటం అభినందనీయమని మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, గోకరాజు శివరామరాజులు అన్నారు. గ్రామ పరిధిలోని వెంకటాపురం ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం ట్రస్టు అధినేత దాట్ల వెంకటరామరాజు లక్ష రూపాయలతో నూతనంగా నిర్మించిన రేవును బుధవారం ప్రారంభించారు. గ్రామంలో ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలను తెలుసుకుంటూ వారికి ఉపయోగపడే విధంగా ట్రస్ట్ ద్వారా సేవలు చేస్తున్నారని తెలిపారు. కుమార్తె పేరా ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలకు సహాయం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధినేత దాట్ల రామరాజును గ్రామ సర్పంచ్ సాదు శ్రీదేవి దంపతులు ఘనంగా సత్కరించారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తూ సేవలందిస్తున్న రామరాజు దేవుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని కోరారు. అనంతరం 2వేల మందికి అన్నదానం చేపట్టారు. గ్రామ సర్పంచ్ సాదు శ్రీదేవి శ్రీనివాస్, అడ్డాల నాగరాజు, యాతం తేజ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేజీఆర్‌ఎల్ కళాశాలలో వాల్ ఆఫ్ కైండ్‌నెస్



భీమవరం కేజీఆర్‌ఎల్ కళాశాలలో వాల్ ఆఫ్ కైండ్‌నెస్ ప్రారంభించిన దృశ్యం

భీమవరం: భీమవరం పట్టణంలోని కేజీఆర్‌ఎల్ కళాశాలలో వాల్ ఆఫ్ కైండ్‌నెస్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా పట్టణానికి చెందిన వ్యాపారి బొండా వెంకటసుబ్రహ్మణ్యకుమార్ మాట్లాడుతూ వాల్ ఆఫ్ కైండ్‌నెస్ కార్యక్రమం ద్వారా అవసరమైన వారికి ఉచితంగా బట్టలు, తాగునీటి సీసాలు పంపిణీ చేస్తారన్నారు. ఎవరివద్దనైనా అదనంగా ఉన్న మంచి దుస్తులు, తాగునీటి సీసాలను ఒక చోట ఏర్పాటు చేస్తే వాటిని అవసరమైనవారు ఉచితంగా పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఐ రామచంద్రమూర్తి, పి.జి డైరెక్టర్ తోట రామ్మూర్తి, యు.బి.ఏ. కోఆర్డినేటర్స్ బి శ్రీనిధి, ఎస్ గౌతమ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పి కిరణ్మయి, కె ఐజక్ బాబు, పి మురళీ మోహన్, కె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మురుగు లేకుండా చర్యలు



ఎస్సీ బోస్ కాలనీ గ్రామంలో డ్రెయిన్లు తవ్వుతున్న దృశ్యం

కాళ్ల: గ్రామంలో రహదారులపై మురుగునీరు లేకుండా, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎస్సీ బోస్ కాలనీ సర్పంచ్ మంతెన శ్రీనివాసరాజు తెలిపారు. ఎస్సీ బోస్ కాలనీ పంచాయతీ పరిధిలోని 1, 3వ కాలనీల్లో మురుగునీరు, బురద నిలబడకుండా ప్రొక్లెయినర్ ఏర్పాటు చేసి మురుగుబోదె త్రవ్వకం పనులు బుధవారం గ్రామ సర్పంచ్ శ్రీనివాసరాజు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం సీజన్లలో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలని ఉద్దేశ్యంతో గ్రామంలో సుమారు రూ.2లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో ఎక్కడ రోడ్లపై నీరు నిలవకుండా డ్రెయినేజీ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. నీరు నిలబడకుండా బయటకు వెళ్లేలా ప్రొక్లైన్ ఏర్పాటుచేసి నీటిని బయటకు మళ్లిస్తున్నామన్నారు. ఇప్పటికే దాదాపు పనులు పూర్తి కావచ్చాయని స్పష్టం చేశారు. ఈయన వెంట గ్రామ పెద్దలు ఉన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



భీమవరంలో 5కెరన్‌ను ప్రారంభిస్తున్న గీతాబాయి

భీమవరం (ప్రకాశంచౌక్): ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడానికి భీమవరంలో బుధవారం 5కెరన్‌ను నిర్వహించారు. ఈ 5కె రన్‌ను జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయి జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థి దశ నుంచే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ హెచ్ఐవీ నిర్మూలనలో పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మొదటి బహుమతిగా ఎం. లీలా గణేష్, రెండవ బహుమతిగా బి.సుబేష్, బాలికల విభాగంలో మొదటి స్థానంలో ఎం.జీవరాణి, రెండో స్థానంలో బి.బేబి శివాని నిలిచారు. కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ మధుసూదనరావు, సీఎస్‌ఓ సాక్షి గోపాల్, డాక్టర్ గోవిందబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

కాళ్ల: కాళ్ల మండలం ఆనందపురం గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు బుధవారం గ్రామ పెద్దలు ఉద్దరాజు శ్రీనివాసరాజు ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక, ఆరోగ్య, విద్య, సామాజిక రంగాల్లో తోడ్పాటు అందించేలా సంకల్పించిన బంగారు కుటుంబాల కార్యక్రమంలో భాగంగా పేదరికంతో ఇబ్బంది పడుతున్న ఏడు కుటుంబాలకు ఆయన సహాయం అందజేశారు. ఈయన వెంట అల్లూరి దొరయ్య చౌదరి, బండారు శ్రీను, కూటమి నాయకులు, పంచాయతీ అధికారులు ఉన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

ఉండి: మిషన్ శక్తి అనే కార్యక్రమాన్ని మహిళల భద్రత కొరకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అద్భుత పథకమని ఐసీడీఎస్ ఆకివీడు సీడీపీఓ వాణివిజయరత్నం తెలిపారు. బుధవారం ఉండి మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో మిషన్‌శక్తి కార్యక్రమంపై అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఈ నెల రెండోతేదీ నుంచి 12వ తేదీ వరకు వివిధ రూపాల్లో సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అంగన్‌వాడీలు విస్తృత ప్రచారం చేయాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: మండలంలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో భాగంగా చేపడుతున్న వెలివర్రు ఫీడర్‌కు కొత్త బ్రేకర్ ఏర్పాటు చేస్తున్న కారణంగా ఈ నెల 4వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. దీనిలో భాగంగా వెలివర్రు, ఉణుదుర్రు గ్రామాల్లోని సామాన్య వినియోగదారులు, ఆక్వా చెరువుల యజమానులు పరిశ్రమల యజమానులు గమనించి సహకరించాలని ఈఈ కోరారు.

10న మండల సర్వసభ్య సమావేశం

పాలకోడేరు: ఈనెల 10వ తేదీన బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పాలకోడేరు మండల పరిషత్ సమావేశ మందిరం నందు మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు(చంటి రాజు) మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి. రెడ్డియ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని శాఖల అధికారులు 8 వ తేదీ మధ్యాహ్నం నాటికి ఆయా శాఖల అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమాచారం అందించాలని, అంతేకాకుండా బుధవారం మండల స్థాయి అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



యండగండి పీహెచ్‌సీలో రోగిని పరీక్షిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయ్

ఉండి: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య, ఆరోగ్య సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయ్ అన్నారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. అలాగే ఓపీ, ఐపీ, ఎలక్ట్రోహెల్త్ రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి అందుతున్న వైద్య సహాయంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు, జ్వరాలు తదితర రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎవరైనా రోగుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి రోజు ఆశాలు గ్రామాల్లో పర్యటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.